నమస్తే తెలంగాణ
# వికారాబాద్
13 | హైదరాబాద్, బుధవారం 28 ఫిబ్రవరి 2024 | VIKARABAD


## జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీకి ముగిసిన నామినేషన్లు

**నేడు దరఖాస్తుల పరిశీలన.. బీఆర్ఎస్ 10, ఎంఐఎం 7, కాంగ్రెస్ నుంచి ఇద్దరు దాఖలు..**
**వచ్చే నెల 2 వరకు ఉపసంహరణ గడువు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నామినేషన్ల దరఖాస్తు ప్రక్రియ మంగళవారం ముగిసింది. ఈ నెల 20 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కాగా, చివరి రోజు తొమ్మిది నామినేషన్లు దాఖలు అయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి పది మంది కార్పొరేటర్లు, ఎంఐఎం పార్టీ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు సభ్యులుగా దరఖాస్తులు చేసుకున్నారు. చివరి రోజు ఎంఐఎం నుంచి గౌసుద్దీన్ , మహ్మద్ ఖాదర్, మహ్మద్ ముజఫర్ హుస్సేన్, ఫర్హాద్ బిన్ అబ్దుల్ సమీఅద్ బిన్, మహమూద్ నసీరుద్దీన్, షాహీన్ బేగం, రఫత్ సుల్తానా, కాంగ్రెస్ నుంచి వై. ప్రేమ్‌కుమార్, ఈఎస్ రాజ్ జితేంద్రనాథ్ నామినేషన్ వేశారు. దరఖాస్తులను అధికారులు బుధవారం పరిశీలించనున్నారు. మార్చి 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్ల ఉపసంహరణ, ఆ తర్వాత అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. పోటీలో 15 మంది కన్నా ఎక్కువ మంది నిలిస్తే 7వ తేదీన జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయంలో ఎన్నిక ప్రక్రియను నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామని అధికారులు చెప్పారు. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుందని అధికారులు పేర్కొన్నారు.



చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నంబర్లు వేస్తున్న సిబ్బంది




# ఇది విరామమే.. ఇక విజయమే..

**'వచ్చే నెల 17వ తేదీతో వంద రోజుల గడువు ముగుస్తుంది.. అప్పటివరకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోతే వదిలి పెట్టేది లేదని.. బొంద పెట్టాల్సిందేనని కార్యకర్తలు, నాయకుల కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేత లు పెట్టే కేసులకు భయపడొద్దని .. ఏ సమస్య వచ్చినా అండగా అంటామని అభయమిచ్చారు.'**

- రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి
- అందుకు బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకుందాం
- 420 హామీలపై కాంగ్రెస్‌ను ఎండగట్టాలి
- కేసులకు భయపడొద్దు..అండగా ఉంటాం
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హాజరైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

రంగారెడ్డి, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ)/తుర్కయంజాల్ : ఇది తాత్కాలిక విరామేనని, ఇక నుంచి విజయమేనని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంటామని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మన్నెగూడలోని వేద కన్వెన్షన్ లో మంగళవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్త ల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బీఆర్ఎస్ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ హ యాంలో జరిగిన అభివృద్ధిని చూసి హైదరాబాద్‌వాసులు కాంగ్రెసోళ్ల మాయమాటల్లో పడలేదని, పొరుగున ఉన్న ఇబ్రహీంపట్నం ప్రజలు మాత్రం బస్సు ఫ్రీ, బంగారం ఫ్రీ అన్న హస్తం పార్టీ మాటలను నమ్మి మోసపోయారన్నారు. ఎవరితో మాట్లాడినా..ముఖ్యమంత్రిగా కేసీఆర్ లేని పాలనను ఊహించుకోలేకపోతున్నామని బాధపడుతున్నారని అ న్నారు. కోల్పోయింది అధికారమేనని, పోరాట పటిమ అలాగే ఉందన్నారు. రాబోవు రోజుల్లో ఉద్యమ స్ఫూర్తిని మరోసారి చాటాలని పిలుపునిచ్చారు.

### దొంగ మాటలపై నిలదీయాల్సిందే..

నోటికి వచ్చిన హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతు డిక్లరేషన్..యూత్ డిక్లరేషన్..ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ డిక్లరేషన్ల పేరుతో మొత్తం 420 హామీలను ఇచ్చి. తంతే బూరలో పడ్డట్లు సీఎం కుర్చీలో కూర్చున్నారని ఎద్దేవా చేశారు. మహాలక్ష్మి, రైతుభరోసా, ఆసరా పింఛన్లను చెల్లించేందుకు దాదాపుగా రూ. 70 వేల కోట్లు కావాలన్నారు. వచ్చే మార్చి 17తో వంద రోజుల గడువు ముగుస్తుందని, అప్పటివరకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్‌ను వదిలి పెట్టేది లేదని.. బొంద పెట్టాల్సిందేనని పిలుపు నిచ్చారు. గుంపు మేస్త్రీ రేవంత్ మాటలను ఎవరూ నమ్మడం లేదని, ముఖ్యమంత్రి అంటే కూడా ఎవరికీ నమ్మబుద్ధి కావడం లేదన్నారు. కాంగ్రెస్‌లో జిల్లాకో ముఖ్యమంత్రి ఉన్నాడని, ఎవరి దుకాణం వారి దే..ఎవరి దందా వారిదేనని ఎద్దేవా చేశారు. తొమ్మిది నెలల్లోనే వాళ్ల కువాళ్లే తన్నుకుని చస్తారని, కాంగ్రెస్‌లో ఉన్న సంస్కృతి ఇదేనని విమర్శించారు. కాంగ్రెస్ 420 హామీలపై బీఆర్ఎస్ మూడు పుస్తకాలను ముద్రించి ప్రతి కార్యకర్తకూ పంపిణీ చేస్తున్నదని.. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్య పర్చాలని సూచించారు. కరెంటు పోతే ప్రజలు కేసీఆర్‌నే గుర్తుకు తెచ్చుకుంటున్నారన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో 90శాతం పనులను బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి చేశామని, కేవలం కాల్వలను తవ్వితే నీరు ఇవ్వొచ్చని..ఆ తెలివి కూడా కాంగ్రెసోళ్లకు లేదని మండిపడ్డారు. ప్రాజెక్టులపై కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టాలన్నారు.

### గెలుపునకు కసితో పని చేయాలి..

భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని గెలుచుకునేందుకు పార్టీ శ్రేణులు కసితో పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంచి వ్యక్తి అని..నియోజకవర్గ ప్రజలు ఆయన్ను పోగొట్టుకోవడం బాధాకరమన్నారు. ఆయన కృషితో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, పెద్ద ఎత్తున పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో ఏర్పాటైన ఫాక్స్‌కాన్ కంపెనీతో త్వరలోనే 30 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయ న్నారు. గతంలో స్వల్ప మెజార్టీతో ఎంపీ సీటును కోల్పోయామని, ఈసారి భువనగిరి లోక్‌సభ సీటును గెలుచుకుంటే ఎంపీ ఉన్నాడన్న ధైర్యం ఈ ప్రాంత ప్రజలకు ఉంటుందన్నారు. కాంగ్రెస్ 420 హామీలను కార్యకర్తలు ఇంటింటికెళ్లి ప్రజలకు వివరించాలని.. పార్టీని బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతలు పెట్టే కేసులకు భయపడొద్దని .. ఏ సమస్య వచ్చినా గంటలోపే వచ్చి అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, మాజీ ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, రైతుబంధు సమితి రంగారెడ్డి జిల్లా మాజీ చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, ఎంపీపీ కృపేశ్, కౌన్సిలర్లు కల్యాణ్ నాయక్,రవీందర్‌రెడ్డి, కీర్తన, జ్యోతి, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి, సామ సంజీవరెడ్డి, సంపతీశ్వర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

### ఓటమికి కుంగిపోవద్దు..

కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినందుకు కుంగిపోవద్దు. భువనగిరి ఎంపీ స్థానాన్ని గెలిపించుకోవాలి. ఇంటింటికెళ్లి కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించాలి. ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల తీరు చూస్తుంటే సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిలా ఉన్నది.

–మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

### బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు..

బీఆర్ఎస్ హయాంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయి. కానీ నేటి కాంగ్రెస్ పాలనలో అనుకూల వర్గాలకు మాత్రమే ప్రభుత్వ ఫలాలు అందే దుస్థితి నెలకొన్నది. ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు.. అధినేత కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం సెగ్మెంట్ల అభ్యున్నతికి కేసీఆర్ ఎంతో కృషి చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి.

– సబితాఇంద్రారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే

### శేరిలింగంపల్లి ప్రగతి ఘనత కేసీఆర్‌దే ..

రూ.10 వేల కోట్లతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అభివృద్ధి చేశారు. ప్రస్తుతం సెగ్మెంట్ అన్ని రంగాల్లో ప్రగతి సాధించింది. జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమెరికాను చూసినట్లుగా ఉందని చెబుతున్నారు. సాధ్యం కాని హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రజాగ్రహానికి బలికావడం ఖాయం.

– అరికెపూడి గాంధీ, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే

### బీఆర్ఎస్ ఓటమిని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు..

సంక్షేమం, అభివృద్ధి, శాంతిభద్రతల విషయంలో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నంబర్‌వన్ స్థానంలో నిలిపారు. బీఆర్ఎస్ ఓటమిని రాష్ట్రంలోని ప్రజలతోపాటు ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా జీర్ణించుకోలే కపోతున్నారు. భువనగిరి స్థానాన్ని గెలిపించుకోవాలి.

–క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు

### మాయమాటలు చెప్పి గెలిచారు.

కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి ప్రజలు ఆ పార్టీని గెలిపించారు. సాధ్యం కాని హామీలిచ్చారు. సీఎంగా కేసీఆర్ లేరు అనే విషయాన్ని ప్రజలు నమ్మలేకపోతున్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలి.

–కాలె యాదయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే

### పెట్టుబడి సాయం పంపిణీలో విఫలం..

బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. ముఖ్యంగా షాద్‌నగర్ లాంటి ప్రాంతాల్లో ఉచిత విద్యుత్తు సరఫరాతో అన్నదాతలు పంటలను సాగు చేసుకుని లాభాల బాట పట్టారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు బీఆర్ఎస్ హయాంలో 90 శాతం వరకు పూర్తయ్యాయి. కేవలం కాల్వలను తవ్వితే రైతులకు నీళ్లు అందుతాయి. అధికారంలోకి రాగానే అన్నదాతలకు రైతుబంధు పంపిణీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ రెండు నెలలు గడుస్తున్నా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయడంలో విఫలమైనది.

–అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే

# ఆల్ ది బెస్ట్

**నేటి నుంచి ఇంటర్ పరీక్షలు**

- నిమిషం ఆలస్యమైతే నో ఎంట్రీ
- వచ్చేనెల 14 వరకు జరుగనున్న ఇంటర్ ఎగ్జామ్స్
- ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు
- జిల్లావ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాల్లోనూ సీసీ కెమెరాల ఏర్పాటు
- పరీక్షలకు హాజరుకానున్న 16,823 మంది విద్యార్థులు

వికారాబాద్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగనున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పరీక్షల దృష్ట్యా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. నేటి నుంచి వచ్చేనెల 14 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు చెందిన 16,823 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మరోవైపు మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా నిఘా నీడలో పరీక్షలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని సూచిస్తూ, మరోవైపు నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాలకు విద్యార్థులను అనుమతించడం జరుగుతున్నదని, ఉదయం 8.45 గంటల్లోపు పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

**పరీక్షలు రాయనున్న 16,823 మంది విద్యార్థులు..**

నేటి నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలకు చెందిన 16,823 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జనరల్ విద్యార్థులు 14,136 మందికాగా, ఒకేషనల్‌కు సంబంధించి 2687 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 7799 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, వీరిలో జనరల్-6447 మంది విద్యార్థులు, ఒకేషనల్-1352 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 9024 మంది హాజరుకానుండగా, వీరిలో జనరల్-7689 మంది విద్యార్థులు, ఒకేషనల్-1335 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ పరీక్షల నిమిత్తం జిల్లావ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, వికారాబాద్‌లోని సంఘం లక్ష్మీబాయి గురుకుల పాఠశాల, ఒక మోడల్ స్కూల్, పరిగి, కొత్తగడిలోని రెసిడెన్షియల్ కాలేజీలు, మిగతా 14 పరీక్షా కేంద్రాలు ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రశ్నాపత్రాలను జిల్లాలో ఏర్పాటు చేసిన స్టోర్ పాయింట్లకు చేర్చారు. జిల్లాలో ప్రశ్నాపత్రాలను నిల్వ చేయడంతోపాటు ఆయా పరీక్షా కేంద్రాలకు తరలించేందుకుగాను 10 స్టోర్ పాయింట్లను ఏర్పాటు చేశారు. వీటిలో తాండూరు, వికారాబాద్, పరిగి, మర్పల్లి, కులకచర్ల, దోమ, నవాబుపేట, మోమిన్‌పేట, కొడంగల్, పెద్దేముల్‌లో ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున ఇన్విజిలేటర్లను, లెక్చరర్, రెవెన్యూ, పోలీస్ శాఖతోపాటు ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం, నలుగురు సభ్యులతో కూడిన రెండు సిట్టింగ్ బృందాలను నియమించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకుగాను జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు కృషి చేశారు. కాలేజీ ప్రారంభం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేశారు. జిల్లాలో వికారాబాద్, పరిగి, నవాబుపేట, మోమిన్‌పేట, మర్పల్లి, పెద్దేముల్, తాండూరు, కొడంగల్, దోమ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, వికారాబాద్‌లో రెండు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇంటర్ కాలేజీలు, కులకచర్లలో గిరిజన సంక్షేమ జూనియర్ కాలేజీతోపాటు సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెరుగైన ఉత్తీర్ణత శాతం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి..

నేటి నుంచి జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. నిర్ణీత సమయంలోగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. మాస్ కాపీయింగ్ జరుగకుండా అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు టెన్షన్ పడకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 80 శాతానికిపైగా ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

– ఎన్.శంకర్ నాయక్, ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

**చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 27: తెలంగాణలో అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో ప్రతి ఇంటికీ 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సరఫరా పథకాలను ప్రారంభించిన అనంతరం రంగారెడ్డిజిల్లాలో చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగసభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీల అమలుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌లు పట్నం సునీతామహేందర్‌రెడ్డి, తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, సీనియర్ నాయకులు హన్మంత్‌రావు, కెవెల్లార్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, యాదవరెడ్డి, మల్లురవి, వంశీచంద్‌రెడ్డి, కొండ్రు పుష్పలీల, పట్నం రినీశ్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న జనం